శిథిలావస్థలో అంగన్‌వాడీ భవనం

నార్నూర్ మండలం గంగాపూర్ అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరింది. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలను పక్కనే ప్రభుత్వ పాఠశాలలో ఉండేలా టీచర్ చూస్తున్నారు. ఏళ్లుగా ఈ భవనం నిరుపయోగంగా దర్శనమిస్తున్నది. ఈ భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని దశలో ఉంది. భవనంలో పశువులకు వేసే చొప్పను ఉంచారు. ఐసీడీఎస్ అధికారులు స్పందించి కొత్త భవనం మంజూరు చేయాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

– నార్నూర్, జూలై 7

శిథిలావస్థలో గంగాపూర్ అంగన్‌వాడీ భవనం

భవనంలో వేసిన చొప్ప

అధ్వానంగా శిశుమందిర్ రోడ్డు

గుంతల్లో నిలిచిన ఉన్న వర్షపునీరు

బోథ్‌లోని శిశుమందిర్ రోడ్డు అధ్వానంగా మారింది. వర్షాలతో గుంతలమయంగా మారి నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు గుండా వసతి గృహాలు, జూనియర్ కళాశాల, పోలీస్ స్టేషన్, పోస్టాఫీసులకు వెళ్లేవారు పడరాని పాట్లు పడుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

-బోథ్, జూలై 7

వర్షానికి ఉరుస్తున్న పాఠశాల భవనం

నార్నూర్ మండలం ముక్తాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల భవనం చిన్నపాటి వర్షానికి ఉరుస్తున్నది. ఇటీవల కురిసిన వర్షానికి పైకప్పు నుంచి వర్షపు నీరు పడుతుండడంతో విద్యార్థులు కింద కూర్చోడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలలో 26 మంది గిరిజన పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి పాఠశాల భవనం పైకప్పుకు మరమ్మతులు చేపట్టాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

– నార్నూర్, జూలై 7

ముక్తాపూర్ ప్రభుత్వ పాఠశాల భవనం

వర్షానికి ఉరుస్తున్న భవనం

మాజీమంత్రి సీఆర్ఆర్ వర్ధంతి

ఎదులాపురం : సీఆర్ఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఎదులాపురం : సీఆర్ఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీమంత్రి జోగు రామన్న

బోథ్‌లో చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఎదులాపురం, జూలై 7 : పార్టీలకు అతీతంగా అందరి అభిమానం పొందిన నాయకుడు మాజీమంత్రి సీ రామచంద్రారెడ్డి అని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం మావలలోని చిల్కూరి లక్ష్మి గార్డెన్‌లో సీఆర్ఆర్ ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో పాటు ఆయా పార్టీల నాయకులు సీఆర్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గండ్రత్ సుజాత, సాజీద్‌ఖాన్, ఆత్రం సుగుణ, శ్రీకాంత్ రెడ్డి, దుర్గం శేఖర్, అశోక్, కుటుంబ సభ్యులు లక్ష్మారెడ్డి, సంజీవ్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి మదిలో నిలిచారు సీఆర్ఆర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సీనియర్ నాయకుడు, మాజీమంత్రి దివంగత సీఆర్ఆర్ ప్రతి ఒక్కరి మదిలో నిలిచారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి జోగు రామన్న అన్నారు. చిల్కూరి రామచంద్ర రెడ్డి(సీఆర్ఆర్) ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జోగు రామన్న వెంట నాయకులు మెట్టు ప్రహ్లాద్, నర్సింగ్‌రావు, సంజయ్, అశోక్ ఉన్నారు.

బోథ్, జూలై 7 : బోథ్‌లోని బస్టాండ్ ఎదుట మాజీమంత్రి రాంచంద్రా రెడ్డి వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. సీఆర్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజు యాదవ్, మాజీ ఎంపీటీసీ మహేందర్, నాయకులు భోజన్న, లింగారెడ్డి, గంగారం, రమేశ్, శేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

ఎదులాపురం : జెండా ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేశ్, నాయకులు

ఎదులాపురం, జూలై 7 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో హక్కుల కోసం నిరంతరం పోరాడుతామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఆదిలాబాద్‌లోని తెలంగాణచౌక్ సమీపంలో సంఘం జెండాను ఎగుర వేశారు. అనంతరం మాదిగ అమరులకు నివాళులర్పించారు. అంతకుముందు మందకృష్ణ మాదిగ జన్మదిన సందర్భంగా కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో పట్టణ నాయకుడు మనోజ్, సీనియర్ నాయకులు ఇండ్ల ఎల్లన్న, గణేశ్, ఉద్యోగస్తుల, జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగు గంగయ్య, సమన్వయకర్త శంకర్ పాల్గొన్నారు.

బోథ్, జూలై 7 : బోథ్‌లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం నాయకులు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సమీపంలో పార్టీ జెండా ఎగుర వేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కుడాల స్వామి, రవి, అశోక్, పొనకంటి ప్రసాద్, నల్లసాయి పాల్గొన్నారు.

గుడిహత్నూర్, జూలై 7 : గుడిహత్నూర్‌లోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగు గంగయ్య మాదిగ దండోరా జెండాను ఎగురవేశారు. అలాగే మందకృష్ణ మాదిగ జన్మదినం పురస్కరించుకొని కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, నాయకులు లక్ష్మణ్, విజయ్‌కుమార్, బాలాజీ, గోకుల్, కమలాకర్, కనక కిషన్ పాల్గొన్నారు.

తానూర్, జూలై 7 : హిప్నెల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు సురేశ్‌వాడ్ సాహెబ్ జెండాను ఎగుర వేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ముథోల్ మాజీ అధ్యక్షుడు సురేశ్ మాదిగ, నాయకులు ఉమాకాంత్, గంగాధర్, చిన్న లక్ష్మణ్, గంగాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బైంసా, జూలై 7: పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. అంతేగాకుండా మందకృష్ణ మాదిగ పుట్టిన రోజు సందర్భంగా స్వీట్లను పంచిపెట్టారు. ఈ వేడుకల్లో బాలేరావ్, నందకుమార్, ప్రవీణ్, దిగంబర్, ఆనంద్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

తానూర్‌లో..

సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం, జూలై 7: రెవెన్యూ శాఖ నుంచి వేర్వేరు శాఖల్లోకి బదిలీ చేయబడిన వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలని (టీవీఆర్వో డబ్ల్యూఏ) తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు వెంకటి, వామన్‌రావు ఆదివారం జడ్పీ సమావేశ మందిరంలో ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన వారు సీఎం, మంత్రులు దృష్టికి సమస్యలు తీసుకెళ్లి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కలిసిన వారిలో ఉపాధ్యక్షుడు శ్రీధర్, రాష్ట్ర కమిటీ సభ్యులు అనసూయ, అహల్యా, అరుణ్, నారాయణ, వినాయక్, పురుషోత్తం,షపీ ఉన్నారు.

పరామర్శ

ఎదులాపురం, జూలై 7 : ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త ఫిరంగి మల్లేశ్ ఇటీవల ద్విచక్రవాహన ప్రమాదంలో స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆదివారం తంతోలి గ్రామంలో కార్యకర్త ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు మెట్టు ప్రహ్లాద్, యాసం నర్సింగ్‌రావు, మాజీ ఎంపీపీ సెవ్వ జగదీశ్, నాయకులు సతీశ్, నవతే శ్రీనివాస్, కుమ్ర రాజు ఉన్నారు.

కుంటాల, జూలై 7 : కుంటాల మండలంలోని సూర్యపూర్ గ్రామంలో జంగం గణేశ్ (శ్రీ రాజరాజేశ్వరి స్వామి ఆలయ పూజారి) మాతృమూర్తి ఇటీవల మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పరామర్శించారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ కార్యకర్త గజ్జారాం తల్లిని పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఎదులాపురం, జూలై 7 : కాలనీలో, ఇంటి పరిసరాల ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విలువైన వస్తువులు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. పక్కనే మహారాష్ట్ర ఉండడంతో దొంగలు వచ్చే అవకాశాలు చాలా ఉన్నయన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఇంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దొంగతనం జరిగిన సమయంలో ఫూటేజీ ఆధారంగా దొంగలను గుర్తించడానికి వీలు అవుతుందన్నారు. కాలనీలో అనుమానాస్పదంగా తిరుగుతుంటే వెంటనే డయల్ 100 నంబర్ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన కొన్ని నిమిషాలలోనే అక్కడికి పోలీసులు చేరుకుంటారని గుర్తు చేశారు.

మాజీ జడ్పీటీసీకి సన్మానం



మాజీ జడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

బోథ్, జూలై 7 : బోథ్ మాజీ జడ్పీటీసీ ఆర్ సంధ్యారాణి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు తహెర్ బిన్ సలాంను ఆదివారం నాయకులు శాలువాలతో సన్మానించారు. బోథ్ మండలాభివృద్ధికి వారు పాటుపడిన తీరును గుర్తు చేశారు. కార్యక్రమంలో సోనాల మాజీ సర్పంచ్ సదానందం, సోనాల గ్రామ కమిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు మునేశ్వర్ సోమన్న, మాజీ వార్డు సభ్యులు భోజరాజు, జీవన్, రామయి శంకర్, కిష్టయ్య పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయండి

పెంబి, జూలై 7: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో బీడీ కార్మికులకు చేయూత పథకం ద్వారా రూ. 4 వేలు అందిస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలని ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి సునాకారి రాజేశ్ డిమాండ్ చేశారు. ఈ నెల 10వ తేదీన కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నా కార్యక్రమం సందర్భంగా మండలంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఆంక్షలు లేకుండా బీడీలు చుట్టుతున్న ప్రతి కార్మికురాలికి చేయూత పథకం ద్వారా రూ. 4 వేలు పింఛన్‌తో పాటు, కనీస వేతానాలు అందించాలన్నారు. కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి బీడీ కార్మికులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దుర్గం లింగన్న తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నాను..

ఎదులాపురం, జూలై 7 : ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి, ప్రజల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వడం లేదన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రాములు, ఎస్ అరుణ్ కుమార్, సీనియర్ నాయకులు కట్టుకోజి స్వామి పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్ అర్బన్, జూలై 7: గీతా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆదివారం మోకు దెబ్బ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తన నివాసంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు అమర వేణి నర్సాగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కల్లుగీతా కార్పొరేషన్ కార్యవర్గాన్ని నియమించి రూ.5వేల కోట్ల నిధులు కేటాయించాలన్నారు. గీత వృత్తిని ఆధునీకరించి కార్మికులకు సేఫ్టీ మోకులను అందించి ప్రమాద బీమా రూ.10లక్షల వరకు పెంచాలని కోరారు. ట్యాంకు బండ్‌పై పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి జనగామ జిల్లాను పాపన్న జనగామ జిల్లాగా గెజిట్‌ను విడుదల చేయాలని, గీత కార్మికులకు ద్విచక్రవాహనాలను అందించాలని కోరారు. ఇక్కడ రాములు, బాలేశం గౌడ్, ఆంజనేయులు, స్వామి గౌడ్, రేఖగౌడ్ ఉన్నారు.

పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

ఖానాపూర్ రూరల్, జూలై 7: ఖానాపూర్ మండలం సింగాపూర్ పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం ప్రత్యేక పూజలు చేశారు. కట్నకానుకలు అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో నిమ్మల రమేశ్, దయానంద్, పరిమి సురేశ్, జన్నారం శంకర్, నాయిని సంతోష్, తోట సత్యం, రాజేశ్వర్, స్వప్నిల్ రెడ్డి, గంగేశ్వర్, పూజారి లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు నిర్మల్ వాసికి ఆహ్వానం

స్వదేశ్

నిర్మల్ అర్బన్, జూలై 7: మహారాష్ట్రలోని చారిత్రాత్మక ప్రదేశం వార్ధాలోని సేవా గ్రామ్ ఆశ్రమంలో జరిగే భారత్ జోడో అభియాన్ జాతీయ సదస్సుకు నిర్మల్‌కు చెందిన పరికిపండ్ల స్వదేశ్‌కు ఆహ్వానం అందింది. ఈ నెల 8,9 తేదీల్లో జరిగే జాతీయ సదస్సుకు దేశ వ్యాప్తంగా పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మేధావులు హాజరవుతున్నారని ఈ జాతీయ సదస్సుకు కన్వీనర్ యోగేంద్ర యాదవ్ హాజరువుతున్నారని తెలిపారు.

అదుపు తప్పి లారీ బోల్తా

సిరిచెల్మ ఘాట్ వద్ద బోల్తాపడిన లారీ

ఇచ్చోడ, జూలై 7 : ఇచ్చోడ మండలం నుంచి సిరిచెల్మకు డీఏపీ ఎరువుల లోడ్ వెళ్తున్న లారీ సిరిచెల్మ ఘాట్ వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఇందులో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు. ఘాట్ వెడల్పు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా బోనాల సంబురం

బోథ్: పొచ్చెరలో బోనాలతో వెళ్తున్న కుమ్మరి సంఘం మహిళలు

బోథ్, జూలై 7: పొచ్చెరలో కుమ్మరి సంఘం, బోథ్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో బోనాల వేడుకను వైభవంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు నెత్తిన బోనాలతో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు.

నిర్మల్ అర్బన్, జూలై 7: నిర్మల్‌లోని శ్రీనగర్ కాలనీ, బంగల్ పేట్, బాగులవాడ, ఆదర్శనగర్, హౌజింగ్‌బోర్డు కాలనీతో పాటు ఇతర వార్డుల్లో భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

భైంసా టౌన్, జూలై 7 : వర్షాలు కురువాలని వేడుకుంటూ ఆదివారం భైంసా మండలం వానల్‌పాడ్‌లో గ్రామస్తులు ఇంటికో బోనంతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

భైంసా, జూలై 7 : పట్టణంలోని కిసాన్ గల్లీలో కమలాపురం పోచమ్మ, ఐదు చేతుల మైసమ్మ వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కిసాన్ గల్లీ సర్పంచ్ కుంట రాజలింగు, ఉపసర్పంచ్ సాయినాథ్, వీరేశం, మల్లేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు

ఊరేగింపుగా వెళ్తున్న వానల్‌పాడ్ గ్రామస్తులు

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

పంట పొలంలో పడిపోయిన విద్యుత్ స్తంభం

ఇంద్రవెల్లి, జూలై 7: మండలంలో శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో దేవాపూర్ నుంచి పిప్రి గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపోయింది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ధనోరా నుంచి తమ గ్రామానికి విద్యుత్ అందించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు కోరారు.

వనదేవతకు ఆదివాసీ సంప్రదాయ పూజలు

నార్నూర్, జూలై 7: ఎంపల్లి గోండుగూడ ఆదివాసీల ఆధ్వర్యంలో అకాడీ పూజలు భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వనదేవతకు సంప్రదాయ పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

రెండు మద్యం దుకాణాల్లో చోరీ

ఎదులాపురం, జూలై 7 : ఆదిలాబాద్‌లోని రెండు మద్యం దుకాణాల్లో చోరీ ఘటనలు ఆదివారం వెలుగుచూశాయి. విద్యానగర్‌లోని బాలాజీ, శివాజీచౌక్‌లోని తిరుమల వైన్స్‌లో శనివారం అర్ధరాత్రి దుండగులు షటర్లకు ఉన్న తాళాలను పగలగొట్టి చోరీ చేశారు. బాలాజీ వైన్స్‌లో రూ.50వేల వరకు నగదు అపహరించినట్లు యజమాని తెలిపారు. తిరుమల వైన్స్‌లో మద్యం తాగారు. ఈ విషయాన్ని ఆ సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు వైన్స్‌షాపు షటర్ పగలగొట్టి ఉండడం గమనించారు. దీంతో వెంటనే వైన్స్‌షాపు యజమానికి సమాచారం అందించారు. సీసీటీవీ పుటేజ్ రికార్డులో దృశ్యాలను పరిశీలించారు. దొంగతనం ఇద్దరు వ్యక్తులు చేశారని నిర్ధారించారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు తరలివెళ్లిన క్రీడాకారులు

రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్న క్రీడాకారులు

నిర్మల్ అర్బన్, జూలై 7 : నిర్మల్ జిల్లాలో అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మహాత్మా జ్యోతిబాపూలే బాలుర పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు తరలివెళ్లారు. పోటీలకు తరలివెళ్లిన విద్యార్థులు విఘ్నేష్, రేవంత్, రణదీర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతోష్ అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ పెంటన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గ్రామస్తులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్

ఉట్నూర్ రూరల్, జూలై 7: వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి పంద్ర జైవంత్‌రావ్ అన్నారు. ఆదివారం మండలంలోని చాప్రాల్, గుట్టగూడెం గ్రామాలను సందర్శించారు. గ్రామంలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు



కుంటాల : జడ్పీఎస్ఎస్ 2001-02 బ్యాచ్ విద్యార్థులు

కుంటాల, జూలై 7: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-02 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించి అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఉపాధ్యాయులు మాణిక్ రావ్, రమేశ్ గౌడ్, నారాయణ, పుండలిక్ రావు, జావేద్ పాల్గొన్నారు.

ఇచ్చోడ, జూలై 7 : ఇచ్చోడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986-87లో పదో తగతి చదువుకున్న పూర్వ విద్యార్థలు రాయల్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో కలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు పురుషోత్తంరావ్, ఖాజా మియా, నారాయణరెడ్డి, ప్రమీల, లక్ష్మారెడ్డి, పోశెట్టిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇచ్చోడ: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కుమ్మరి సంఘం కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన నూతన కార్యవర్గం

నిర్మల్ చైన్‌గేట్, జూలై 7 : నిర్మల్ పట్టణ కుమ్మరి సంఘం నూతన కార్యవర్గం ఆదివారం పట్టణ సంఘ భవనంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొత్తపల్లి రఘు, సహ అధ్యక్షుడిగా పోతుగంటి స్వామి, ప్రధాన కార్యదర్శిగా పోతుగంటి సంతోష్, కోశాధికారిగా తోడిశెట్టి శ్రీనివాస్, సిలారి సతీశ్, గౌరవాధ్యక్షుడిగా పోతుగంటి రాములు, ఉపాధ్యక్షులుగా ఎగుడు భూమేశ్‌కుమార్, పోతుగంటి తుకారాం, కార్యదర్శులుగా పోతుగంటి చిన్న మల్లేశ్, రాజారపు శ్రీనివాస్, రాజుర సాయన్న, పోతుగంటి సాయికుమార్, సలహా సభ్యులుగా కొత్తపల్లి గంగాధర్, భూసారపు గంగాధర్, తోడిశెట్టి రవికాంత్, కొత్తపల్లి రాజేశ్వర్, కొత్తపల్లి రమేశ్‌ను ఎన్నుకున్నారు.

బావిలో పడి యువకుడి మృతి

ఇంద్రవెల్లి, జూలై 7: ఇంద్రవెల్లి మండలం దోడంద గ్రామానికి చెందిన పంద్ర బండు(15) వ్యవసాయ బావిలో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 5వ తేదీన పంద్ర బండు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువుల వద్ద వెతికినా అయిన ఆచూకీ లభించలేదు. దోడంద గ్రామానికి కొద్ది దూరంలోని ఓ వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. తండ్రి పంద్ర జంగు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పంద్ర బండు(ఫైల్)